బ్యాంకి బుచ్చిరాజు

[ఒక కల్పితకథ]

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ గారు

ఈ పేరు చూడగనే బ్యాంకి యనునది యింగ్లీషుమాటగదా, బుచ్చిరాజు శుద్ధ తెలుగువాడుగదా ఇతని కీ యింటి పేరెట్లు వచ్చెనని చదువరులకు సందేహము కలుగవచ్చును. అతని యింటిపేరు కల్లుపల్లి వారు. కాని యాపేరు వ్రాతయందేకాని వాడుకయందు లేదు. కల్లుపల్లి బుచ్చిరాజుగారనిన నిప్పుడాతని నెవరు నెఱుగఁజాలరు. అయితే నిజగృహ నామమును నిర్మూలము చేయునంతటి యీ బ్యాంకిపేరెట్లు వచ్చెనను సందేహము కలుగవచ్చును. అందు కొకకథకలదు.

బుచ్చయ్యకు చిన్నతనముననే తండ్రి పోయినాడు. ఆస్తిలేదు. కాన జీవనోపాయముగానక భాగీరథి కొమారుడగు బుచ్చిరాజును, కొమార్తెయగు వెంకాయమ్మను తీసికొని తెనాలి వచ్చినది. భాగీరథమ్మ తానొక ప్లీడరుగారియింట్లో వంటచేసి నెలజీతము గొనుచు బుచ్చిరాజును మధూకరమునకు పంపి యాయన్నముతో పిల్లబిడ్డలకు భోజన ముగడపుచు దినములు పుచ్చసాగినది. నాలుగేండ్లు యిట్లు గడచినవి. వెంకాయికి పెండ్లి [illegible]డు వచ్చినది. నలుబదేండ్లు మించిన [illegible]నకు నాలుగువందలుపుచ్చుకొని పిల్లనిచ్చి పెండ్లిచేసి భాగీరథమ్మ కన్యాశుల్కము విడిపించుకొనినది. పిల్లను వెంటనే యత్తవారు తీసికొని వెళ్లిరి. భాగీరథమ్మ యింతటితో కొమారునకు మధూకరవృత్తి మాన్పించి పెద్దమును స్కూలుయింట్లలో నారము తేర్పించెను.

ఈవిధముగా మఱియైదాఱేండ్లు గడచినవి. యెట్లట్లో నోడవతరగతి ముగించి బుచ్చిరాజు నాటకసమాజములలో వెట్టిచాకిరి చేయుచు కూనిరాగములు తీయుచు నాయకపాత్రముధరించుటలో కుశలుడగుచుండెను. చదువు సంధ్యలు చాలించి సోమరియై తిరుగుటనుజూచి భాగీరథమ్మ బడిపంతులు చేసికొనియైనను బ్రదుకునని బోధనాభ్యాసనపాఠశాలలో (ట్రైనింగుస్కూలు) ప్రవేశపెట్టెను. రెండేండ్లు యెట్లెట్లో కష్టపడి చదివి యీపరీక్షనుగూడ బుచ్చిరా జైనా డనిపించెను. ఇప్పటివలె "నీవు బ్రాహ్మణుడవా? అయినచో నుద్యోగమీయము, పొమ్మ"ను ప్రత్యక్ష బ్రాహ్మణద్వేష మాకాలపు బ్రాహ్మణేతర మహాశయులకు లేమింజేసి తాలూకాబోర్డు ప్రెసిడెంటు బ్రాహ్మణేతరుడైనను, భాగీరథమ్మ పోయి యాచింపగనే బుచ్చిరాజునకు సులభముగానె యుద్యోగము లభించినది.

బుచ్చిరాజు ఒకపల్లెటూరిబడికి పంతులుగా నియమింపబడుటచే తెనాలి వీడి యాగ్రామమునకు వెళ్ళిపోయెను.

౨

పంతులు బుచ్చిరాజు తనయుద్యోగ గ్రామములో నల్లకోటుతో, కుచ్చుపాగతో, కిర్రుచెప్పులతో ఠీవిగా చరించుచుండెను. బుచ్చిరాజు నాటకగీతములు యునకుటను, రాత్రులుచేసెడి రామాయణ కాలక్షేపము వృద్ధులను, నాకర్షించుటచే నాతని పని బాగుగా నుండెను: కాయగూరలు, చల్ల, పుల్లలు వగైరాలు పంతులుకు గ్రామజను లుచితముగా బంపుచుండిరి. పైపెట్టు దసరా రాబడులు మున్నగు ఇతరమామూళ్లుగూడ వచ్చుచుండెను. మఱియు బుచ్చిరాజు చిన్నతనమునుండియు మాటలలో చతురుడు; ఇతరులవద్ద రాబట్టుకొనుటలో దిట్ట; తనసొమ్ము వ్యయపఱచుటలో గట్టి; కాన కొద్దిలో కొద్ది సొంతమునకు వ్యయపఱచుకొని మిగిలినది వెనుక వేయుచుండెను.

దైవానుగ్రహమువలన కొమారునకు నుద్యోగము లభించినది. ఇక నొక యింటివానిని జేయవలయుననెడి కోరికయొకటి భాగీరథమ్మ మనస్సున పీడింపుచుండెను. అందుకొఱకు భాగీరథమ్మ భగీరథప్రయత్నములు చేయసాగెను. ఊరూరుతిరుగుచుండెను. కన్నకన్నవారిని ప్రార్థింపుచుండెను. ఈకార్యసాఫల్యముకొఱకామె తాత్కాలికముగా దనవంటకత్తెతనముగూడ చాలించుకొనెను. పుత్త్రప్రేమ యనుపమానమైనదిగదా! పండ్లు కండ్లు లేని ముదుసళ్లకును, పొట్టపొడిచిన యక్షరములేని నిరక్షర కుక్షులకును, గవ్వగడించలేని యప్రయోజకులకును, కన్యకలనీయ వెనుదీయని తల్లిదండ్రులుగల మనదౌర్భాగ్య దేశములో బుచ్చయ్యవంటి సంపాదనాపరునకు కన్యదొరకుట యొకకష్టమా!

మట్టిపూడిలో వేంకటసుబ్బయ్యగారొక సామాన్యగృహస్థుడు. ఆయనకు యేడుగురు కుమార్తెలు. నాలుగవపిల్లకు మనువుకుదుర్చుకొని పెండ్లి చేయు ప్రయత్నముమీద ఉండెను. ఆయిదవకొమార్తెయగు పున్నమ్మ యేడేండ్లపిల్ల. పాలదంతము లూడిన బోసినోటితో, దుబ్బుతలతో, పేడచేతులతో, జేనెడుజుట్టునకు బారెడునూలు బొందుపెట్టి యల్లిన జడతో, బెత్తెడు బెత్తెడు తెల్లపువ్వుల పరికిణీకట్టుకొని బొడ్డునదోపుకొని పలుగురాళ్ల యచ్చనగాయలతో, కాపుపిల్లలతో గలిసి విచ్చలవిడిగా నాడుకొనుచున్నది. భాగీరథమ్మ వెళ్లి యాపిల్లను నాకొమారునకీయవలసినదని యడిగినది. అడుగుటయే కాదు; నిర్బంధించినది. ఆడపిల్ల లెక్కువగా గలవాడగుటచే సొమ్ము కలిసివచ్చునని వేంకటసుబ్బయ్యగూడ యొప్పుకొనినాడు.

భాగీరథమ్మ యఖండ కృషివలననైననేమి, గ్రామస్థులసాహాయ్యమువలననైననేమి, బుచ్చిరాజు సంపాదనాచాకచక్యమువలననైననేమి బుచ్చిరాజువివాహమైనది. సప్తవర్ష కన్యాపరిగ్రహముచేసి బుచ్చిరాజు గృహస్థైనాడు. కన్నె చిన్నదైనను జందెము పెద్దదిపడినది. ఇక నేమికావలెను?

3

వివాహమైన యేడేండ్లకు పున్నమ్మ కాపురమునకు వచ్చినది. పెద్దతనమువచ్చుటచే భాగీరథమ్మకూడ కొమారునివద్దకు చేరినది, తల్లి భార్యలను పోషించుభారము, పాపము, బుచ్చిరాజు నెత్తిపైనొక్కమారే పడినది. బుచ్చిరాజు చిన్నతనమునుండియు ఒంటరితనమునకు నలవాటు పడినవాడు; పొత్తుగిట్టనిపొట్టచెట్టు; పైస పోకగా మూటగట్టనేర్చిన లోభి కాని తినగసవ్వ మూడు దినములు దాచుకొని తిను పొదుపరి. ఒక్క కోటుకుట్టించుకొనేనేని మరలమరల మరమ్మతులతో పురుషాంతరములు గడుపును. ఒక్కగానొక్కతోబుట్టువునకు పదేండ్లనుండి యుద్యోగముచేయుచుగూడ, నొక్కచీరకాదుగదా రెండుగజముల రవికలగుడ్డకాదుగదా, ఒక్కకాని కుంకుమపొట్లము కొనియిచ్చిన పాపమున బోలేదు. అట్టివానికి అమాంతముగ నొక్కమారు మాతృపత్నీసంరక్షణ బాధ్యత పైబడినప్పుడు మిన్నువిఱిగి మీదపడినట్లుండదా! పాపము! పప్పు, ఉప్పు, బియ్యము, వగైరాలు యింటికి తీసికొని రావలసివచ్చినప్పుడెల్ల బుచ్చయ్య ప్రాణము గిలగిలలాడుచుండెను. నానాపాట్లుపడి తల్లి చదువుసంధ్యలుచెప్పించి, పెండ్లిచేసి నానావిధముల తనపురోభివృద్ధికి దోడ్పడిననాడును, మూడేండ్లునిండని పసిబాలను పెండ్లాడి పల్లకీయెక్కి యూరేగునాడును, వీరిసంరక్షణబాధ్యత నాదేనని బుచ్చిరాజు తలపలేదు గాబోలు, పాపము!.

పున్నమ్మ శ్రీమంతుల యింటిపడుచుకాకున్నను అన్నవస్త్రములకు లోటైనచోటునుండి వచ్చినది కాదు. పాడిపంటలు సమృద్ధిగాగలిగిన పల్లెటూరి కుటుంబములో బుట్టి పదిమందిలో మెలగిన పిల్ల. చిల్లులపట్టు గింజలతో జేయు బస్తీనాగరికపు లాంఛనములు కు సరిపడవు. పదిమంది దాక్షిణ్యములు లేకున్నను పట్టెడు పప్పును, పట్టెడునేతినిగాని పచ్చడిని వేసికొని పదిముద్దలు మెక్కి కంచెన్నములో గిల్లిన దొరుగునట్లు చిక్కనిమజ్జిగ బోసికొని కడుపునిండ తినమరిగిన మనిషి. తిండియందెంత మోటయో, పనియందంత మోట; పనియందెంత మోటయో, యునికియందంత మోట; ఉనికియందెంత మోటయో మాటయందంత మోట; కాని స్వాభిమానమునకు మాత్రము పున్నమ్మ పెట్టినది పేరు. పొరుగింట అగ్గిపుల్లకైనను నడిగి తెచ్చుట కిచ్చగింపదు. పరులగోడవకు తాను బోదు; తనగోడవ నొరులతో జెప్పదు. తన్నెవరైన కాని మాటలాడిరా యోర్వదు. ఒకటికి నాల్గుపెట్టును. ఇది పున్నమ్మస్వభావము. చేతి దమ్మిడివదలకుండ కల్లబొల్లి మాటలతో కాలక్షేపముచేయు బుచ్చిరాజుదృష్టిలో పున్నమ్మ వట్టిపనికిమాలినదిగా దోచినది. నలుగురను మంచిమాటలాడి నేదియు దెచ్చుకొనుట చేతగాదు. "పస్తైనుంటాను; చస్తేముండమోస్తా" ననికూర్చుంటుందని బుచ్చిరాజు పున్నమ్మను దూషింపసాగినాడు. ఇంటింట యిచ్చకము లాడి పనిపాటలుచేసి సంపాదింప నలవాటుపడిన భాగీరథమ్మకు

గూడ పున్నమ్మ బుద్ధులు రుచింపలేదు. కాన పున్నమ్మను చీవాట్లుపెట్టుటలోను, చీదరించుటలోను తల్లికొడుకు లేకమైరి. నిత్యము అన్నములోనికి, జేసికొనిన పప్పు, కూర, వగైరా పదార్థములలో కొంతకొమారునకు వేసి మిగిలినదవ్వంత తనవిస్తరిలో రాల్చుకొని యింతగోగు ఉండెనో, చింత ఉండనో మాగాయబద్దయో, కోడలికంచములో వేసి చూకునీళ్లవంటి మజ్జిగనీళ్లను గిన్నెలోబోసి దగ్గరపెట్టి భాగీరథమ్మ పొరుగింటముచ్చటలాడ వెళ్లెడిది. పెండ్లాడునాడు పెనిమిటికుండు సంబరమును, కోడలువచ్చునన్నప్పుడు అత్తగారికుండెడి సంబరమును, స్థిరమును మర్మరహితమును నైనచో నేటేటకోడండ్రజలమరణముల వినవలసినకర్మమేమి మనకు?

ఒక్కయేడాది గడచినది. పున్నమ్మ యెట్లులనో బయటపడకుండ కాలక్షేపము చేసినది. ఇంతలో పున్నమ్మకు నెలతప్పినది. నిత్యము తినుపదార్థములయందు యిష్టము తప్పినది. క్రొత్తక్రొత్తవానిపై కోరిక లుదయింపసాగినవి. కాని యెట్లుతీరును? ఎవరు చేసిపెట్టెదురు? కాకకాక కొమారునకు వివాహమైనందులకు మనుమల నెత్తుయోగము పట్టినదిగదా యను సంతసముచేనైన భాగీరథమ్మ కోడలికోరికలు దీర్ప యత్నింపలేదు. అన్నము రుచింపకపోవుటచే నిత్యోపవాసములు చేసిచేసి పున్నమ్మ కృశించిపోయినది. మనిషి చిక్కినకొలంది మనస్సున క్రోధాగ్ని విస్తరించినది. భరింపలేక పున్నమ్మ యొకనాడు విడిపడినది. తిండిపెట్టకచంపుచున్నారని అత్తను మగనిని నానామాటలని శోకముపెట్టుచు నట్టింట కూర్చున్నది. "ఇంటబడి దయ్యమువలె తింటూ, తినలేదని వీధికెక్కి అల్లరిచేస్తున్నావా" అని బుచ్చిరాజు భార్యను రెండు కొట్టెను. "తిని లేదంటే తిరిచినా పుట్టదు. పూటపూటా రెండుకంచాలు మెక్కుతూ వీధిలో అల్లరిచేస్తున్నది చూడు" మని పండ్లు పటపటకొఱకుచు భాగీరథమ్మ గూడ కోడలిని రెండుదెబ్బలు వేయవచ్చెను. ఆసవ్వడి కనిపెట్టి పున్నమ్మ యత్తగారిచేతిని కసక్కున నోట కఱచుకొనెను. కుయ్యో! మొఱ్ఱో! యని భాగీరథమ్మ యూరునాడు లేకమగునట్లు గోలెత్తెను. ఇంతలో బుచ్చిరాజువచ్చి తల్లిని తపతప రెండు బాదెను. పున్నమ్మ నోటిపట్టు వదలినది. "ఆరి దొంగముండాకొడుకా, పెండ్లాము నోటితోకఱుస్తుంటే విడిపించవలిసిందిపోయి, నీవుకూడా చావకొట్టావట్రా! నీకుచ్చితం కూలిపోను!!" అని కొమారునిగూడ భాగీరథమ్మ శపింపసాగెను. "అయ్యో, నన్ను తిట్టుతావేమిటమ్మా! నిన్ను కొట్టడం నీమేలుకొఱకే; ఆలోచించావో లేదో. నేను కొట్టకపోతే అది నీచెయ్యి వదిలేదేనా? అన్యాయంగా చెయ్యి రెండుముక్కలైపోకపోయిందా? అనక యేమనుకుంటే యేముంది. అందుచేత కొట్టితినిగాని నీమీద పగచేత నటమ్మా!" యని బుచ్చిరాజు తల్లిని ఊరడించెను. బుచ్చయ్య చెప్పిన సమాధానమునకు జగడముచూడవచ్చిన పిన్నపెద్ద లెల్లరు పకపక నవ్విరి. ఈజగడములో తప్పు భాగీరథమ్మదో, బుచ్చిరాజుదో, పున్నమ్మదో, ప్రేక్ష

కులు నిర్ణయింపలేకపోయిరి. ఒకచేయి కోడలినోటఁ జిక్కినప్పుడు భాగీరథమ్మ రెండవ చేయి యేమిచేసినది? కాన పున్నమ్మ మొగమున నైదు గోటిపీకులు! భాగీరథమ్మ చేతికి నాలుగుపంటినొక్కులు! తగవు ముగిసినది. మఱునాఁడు గొల్లున గోలెత్తుచు భాగీరథమ్మ కొమార్తెయింటికి లేచిపోయినది. భాగీరథమ్మ కొమార్తెను అమ్మి కొమారుని వృద్ధిలోనికిఁ దెచ్చినది. వృద్ధిలోనికి దెచ్చిన కొమారుఁడు వెడలగొట్టినాఁడు. అమ్మకొనినకొమార్తె యన్నముపెట్టుట కాధారమైనది. చిత్రము గదా దైవఘటన!

౪

ఏడుమాసములు వచ్చినవి పున్నమ్మకు. సూడిదచేయవలెనని చలిమిడి, అరిసెలు, మణుగుబూరెలు, పసుపు, కుంకుమ, పండ్లు, ఆకులు, పోకలు, చీర, రవికెలగుడ్డ వగైరా వస్తువులెల్ల తీసికొని పున్నమ్మ తల్లివచ్చినది. వచ్చినవస్తువు లన్నియు బైటపెట్టువఱకూరకొని సాయంత్రపువేళ ముత్తైదువు లందఱను పిలిచి వేడుకచేయవలెననుకొను వేళకు "మా యింట నానువాయితీ లేదు. ముత్తైదువులను పిలుచుటకు వీలుగా" దని బుచ్చిరాజు అత్తగారిని నిరోధించెను. పెండ్లియే యానవాయితీలేని బుచ్చయ్యయింట గర్భవతుల సూడిదల యానువాయితీ యుండునా! పున్నతల్లి కోపమువచ్చి వెళ్లుచున్నప్పుడు వల దనలేదు; వెళ్లినతరువాత రమ్మనలేదు; అట్టివాఁడు బుచ్చిరాజు. అత్తగారు వచ్చి రెండు ములైనది. మూఁడవనాఁటి యుదయము బడికి వెళ్లబోవుచు బుచ్చిరాజు అత్తగారివద్దకువచ్చి "నేను కొద్దిజీతగాఁడను; నాది పేద కాపురము. ఈదినమువఱకింటికి వారు వెళ్లిన దప్ప లేకున్న నేను భరింపజాలు"నని చెప్పెను. అత్తగారి మనస్సు చివుక్కుమనెను. కన్నులనీరువచ్చెను. అయినను మానాభిమానములను సిగ్గుఎగ్గులను గూడ తోసిపుచ్చి చేయునది గదా కడుపుతీపు! కాన యామెయల్లునిజూచి "నాయనా! నేను యీపూటనే వెళ్లెదను. కాని పిల్లకు నేడవమాసముగూడ వచ్చినది గదా పురిటికంపవా" యనెను. "మహారాజులాగ తీసికొనివెళ్లండీ నా యభ్యంతరము లే" దని బుచ్చిరాజు నిస్సంకోచముగా బలికెను. అత్తగారికి రెండుపూట లన్నము పెట్టజాల నని బుచ్చిరాజునకు భార్యభారముకూడ తీరునని సంబరము కాదా! పున్నమ్మతల్లి రెండెడ్ల బండి కట్టించుకొని యాపూటనే స్వగ్రామము వెళ్లిపోయెను. భార్య వెళ్లినందులకు చింతింపలేదు గాని యత్తయు, భార్యయు వండినపంటలు వగైరా పదార్థములు వదలిపెట్టి వెళ్లినందులకు మాత్రము బుచ్చిరాజు మహాసంతసించెను.

పున్నమ్మ పుట్టినింటికి వెళ్లిన మూఁడు మాసములకు ప్రసవమైనట్లును, ఆడ శిశువు కలిగినట్లును వార్తగల శుభలేఖను తీసికొని బ్రాహ్మణుఁ డొకఁడు బుచ్చిరాజు వద్దకు వచ్చెను. ఆవార్తను జూచుకొని బుచ్చిరాజు నిర్విణ్ణుఁడైపోయెను. గుండె కొట్టుకొని "అయ్యో! ఆడపిల్ల! ఆడపిల్ల! ఆడపిల్లే! ఏడవలేకపోయినది. వెధవకాన్పు! ఈ ఆడచెత్తను కనుటకేనా అన్ని సూడిదలు, అన్ని ముచ్చ

టలు." అని విసుగుకొని, తిట్టుకొని, చీదరించుకొని నానాకంగారుపడెను. బుచ్చయ్య కొంచెం స్థిమితపడిన వెనుక శుభలేఖ గొనివచ్చిన బ్రాహ్మణుడు, "అయ్యా! నాకు సెలవిప్పించరా" అనెను.

బు—చిత్తము. వెళ్లండి, బాబు. దీని కింత ప్రార్థన యెందుకు?

బ్రా—మరి నాకు కట్నమిప్పించరా?

బు—(దిగ్భ్రమతో) ఏమికట్నమయ్యా!

బ్రా—శుభవర్తమానము తెచ్చిన బ్రాహ్మణునకు పంచెలచాపు యిచ్చే ఆనవాయితండీ!

బు—పంచెలచాపా! ఘనుడవే! ఇంకా నూట పదార్లు మామూలన్నావు కాదు! ఒకపర హాస్పట్టుకొని వెళ్లి గుంటూరులో పంచెల చాపు కొనుక్కోవచ్చును.

బ్రా—చిత్తము, అదే దయచేయండి.

బు—ఎవరు? నేనీయనా? ఆడపిల్ల పుట్టిందేమో స్వామీ యని నే నేడుస్తుంటే పంచెలచాపిమ్మని నీయేడుపొకటా! అసలు నిన్ను రమ్మన్నదెవరు? కానికార్డు వ్రాయక పోయినారా; తప్పితే ఊరుకోక పోయినారా! నా భార్యాబిడ్డ యింటికి వచ్చిన నాడే చూచుకొందునుగదా!

బ్రా—నాకేమి తెలుసునండీ, వారు పంపితే వచ్చాను. లేకపోతే నాకీకాళ్లతీపెందుకు?

బు—అవునండీ; మామామముండాకొడుక్కు బుద్ధిలేదు. మీ తప్పేముంది.

బ్రా—ఎందుకయ్యా! పెద్దవాడు ఆయనను తిట్టుతావు? పాపము ఆచిన్నది మూడు రోజులు కష్టపడి ప్రసవించింది. తొలి కాన్పు. వారికి సంతోషంగా ఉండి పంపించారు.

బు—ఎన్నిదినములు కష్టపడితేనేమి పిల్ల జీవించే ఉన్నది కాదా!

బ్రా—ఛీ అప్రాచ్యుడా, ఎంతమాటన్నావు? ఆడపిల్లంటే యింత ద్వేషం కలవాడవు కాబట్టే నా ముప్పదేండ్లు దాటినతరువాత ఏనుగుగున్నవలె ఉండి యేడేండ్లపిల్లను పెండ్లాడిందాకా వచ్చావు. పెండ్లాడటాని కాడపిల్లలు, కనటానికి మగపిల్లలు కావలెనా? నీవు పుట్టి వంశ ముద్ధరించావు; ఇక నీకు కొడుకుపుట్టి నిన్నుద్ధరిస్తాడు! చాలు, చాలు! నాకు డబ్బువద్దు. గిబ్బు వద్దు. నాల్గుపరుగులు నడిచివస్తే నాకేమి శ్రమ? నాఫల మెక్కడకు పోదు. నీఋణ మెక్కడకు పోదు." అని యాబ్రాహ్మణుడు నానామాటలాడి చివాలున లేచి పోయినాడు. ఎన్ని తిట్టిననేమి భోజన వ్యయమైన తగులకుండ బాపడు వదలి నందులకు బుచ్చిరాజుకు పరమసంతోష మైనది.

పిల్లను నే వృద్ధవరునకో యమ్మి నాల్గు వందలు లాభముతీయుటకు పున్నమ్మ యంగీకరించునను విశ్వాసము బుచ్చిరాజు కుండె నేని మూడవశిశువు కలిగినందులకు బుచ్చిరాజెంతైన సంతసించువాడే; భార్య బొజ్జవరాల బొజ్జయని మురియువాడే; కాని భార్యయెడ బుచ్చిరాజు కట్టి విశ్వాసము లేదు. పున్నమ్మ తండ్రి యేడుగురుకొమార్తెలు కలవాడైనను,

విశేషవిత్తవంతుఁడు కాకపోయినను సాదఱను కన్యాదానముచేసి పితృదేవతల తరియింపఁ జేసెను గాని కన్యలయెడ నెట్టి యాసుర బుద్ధిని తలపెట్టినవాఁడు కాఁడు. ఆయన చేసిన సంబంధము లన్నిటిలో బుచ్చయ్య సంబంధమే తక్కువైనది. యది పున్నమ్మ దురదృష్ట మనవలెను గాని తండ్రిలోపము కాదు. పున్నమ్మగూడ తండ్రి నాఁటి యాభిమానవతియే యని బుచ్చిరాజు నమ్మకము; కనుకనే బుచ్చిరాజు కంత కంగారు కోపము, మంట! పాపము!

౫

పున్నమ్మకొమార్తె కైదుమాసములు వచ్చినవి. పిల్ల చక్కఁగా పుష్టిచేసి బాతువలె నున్నది. 'ఊఁ ఆఁ' యని యుయ్యాలలో బోసిగడి ముచ్చటలాడుచు కేకిసలుకొట్టి నవ్వుచు ముద్దుగులార్చుచున్నది. బుచ్చిరాజు వచ్చి కొమార్తెను చూచిపోఁడయ్యె. బారసాల మాట తలపెట్టఁడయ్యె. తుదకు భార్యాబిడ్డలను తనయింటికి తీసికొనిపోవుటకుగూడ ప్రయత్నింపఁడయ్యె. పున్నమ్మ పుట్టింటికి వచ్చినతరువాత యిద్దరక్కలు వచ్చి పురుడు పోసికొని వెళ్ళిరి. పున్నమ్మ మాత్రము యెనిమిదమాసములనుండి పుట్టింటనే పడియున్నది. పిల్ల కైదుమాసములు వచ్చినను గూడ యింకను నత్తవారి యింటికి కేగకుండ పుట్టింటనే యుండుట పున్నమ్మ కెంతో యవమానకరముగ నుండెను. మఱియు మిక్కిలి దుఃఖముగా గూడ నుండెను. తుదకు పున్నమ్మ గత్యంతరములేక తానే స్వయముగ పెనిమిటియొద్దకు పోవ సమకట్టెను. తన్ను భర్తయొద్దకు బంపవలసినదని తండ్రి నడిగెను. తండ్రి కోపముతో మండిపడుచు "భాగ్యము సంపాదించినవాని సుఖసామాచారములు తెలిసికొనుటకైన వొక్క యుత్తరము వ్రాయని పిసినికొడుకు తనను కనుఁగొని యడుగకుండా, అన్నము పెట్టలేనివానివలె నేనుముందుగా పంపుతానా, నావల్లగా"దని కోపించి పలికెను. పున్నమ్మ తల్లి నడిగెను. "నాయింటిలో యూరకుండగా సంపాదించిన త్రొక్కు"నని తల్లియనెను. పాపము! పున్నమ్మ యేమి చేయును? అహర్నిశలు యేడ్చుచు కాలముపోయసాగెను. ఇక పున్నమ్మ సహించలేక తల్లిదండ్రులు మేనమామను తోడిచ్చి పెనిమిటి వద్దకు బంపిరి.

పున్నమ్మను జూచి బుచ్చిరాజు నిర్ఘాంతపోయి "యేమిపుట్టిమునిగిందనివచ్చావు? ఎవరు రమ్మంటే వచ్చావు?" అని యుగ్రహాముతో ప్రశ్నించెను. "నా యింటికి నేను వచ్చుటకు, ఒకరిపిలుపేల" నని పున్నమ్మ యింటిలోనికి వెళ్ళెను. బుచ్చిరాజు భార్యవెంబడే లోపలికి వెళ్ళి "ఆయనగూడ యీపూట యిక్కడనే భోజనంచేస్తాడా యేమి" టనెను. "అయ్యో! అప్పారునుంచి తీసికొనివచ్చిన వాడికి భోజనం గూడ పెట్టకుండా పంపుతారా యేమి"టని పున్నమ్మ కనుల నీరుపెట్టుకొనుచు దీనముగా బలికెను. బుచ్చిరాజు మాఱుమాటాడకుండ ఒకశేరు బియ్యమును ఒకపావుశేరు కంది పప్పును తెచ్చి యింటిలో బోసి బడికి వెళ్ళెను. పున్నమ్మ వెంటనె వంటచేసి మామకు భోజ

వముపెట్టి పంపించెను. నాటినుండి భార్యాభర్తలకు కరిమకరిసమరము ప్రారంభమైనది. భార్య తెమ్మనినది తీసికొని రాకుండుట బుచ్చయ్యవ్రతము; మగఁడు చేయుమనినది చేయకపోవుట పున్నమ్మవ్రతము. ఇఁక సమరముగాక సఖ్యత కుదురు టెట్లు? పున్నమ్మ అన్నములోనికి కూర, పప్పు, చేసెద ననును. "గోంగూరపచ్చడి చాలును. ఏమియు చేయవలదనును బుచ్చిరాజు. వాకిట నిలిచిన భిక్షుగానికి భిక్షమును, ఇంటికివచ్చిన బంధువునకు భోజనమును బెట్టుటకు పున్నమ్మ కుతుకపడును. నాయింట నట్టి యాటలు సాగవని బుచ్చిరాజు జగడమాడును. పున్నమ్మ పిల్లకాముదమనును, వెంటనే బుచ్చిరాజు నావద్ద డబ్బు లేదనును. పిల్లకొక క్రొత్తచొక్కాయనును పున్నమ్మ. ఊరిలో పేదపిల్లలందఱు చొక్కాయతొడుగుకొనుచున్నారాయనును బుచ్చిరాజు. ఇంట నిప్పుపెట్టలేదు. తీసికొని రండని భార్యయనును. ప్రొద్దున పొరిగింట నిప్పుతెచ్చుకొని సాయంత్రము దీపము వెలిగించుకొని తెచ్చుకొనిన దినములు వెళ్లవాయని బుచ్చిరాజు సలహాయిచ్చును. ఇట్టి దరిద్రపుపనులు నాచేతగావని పున్నమ్మ ఛీంకరించును. ఈ దుబారాఖర్చులు నేచేయలేనని బుచ్చిరాజు ఆంకెలు వేట్టును. ఈ విధముగా బుచ్చిరాజు కృపణస్వభావము పున్నమ్మకు గిట్టక పున్నమ్మ విరివిబుద్ధి బుచ్చిరాజునకు నచ్చక సత్యవివాదములతో అర్ధపస్తులతో కటికిఉపవాసములతో కాలము గడచుచున్నది. అత్యల్పవిషయములోఁగూడ భర్తయొక్కలుబ్ధచేష్టచూచిచూచి పున్నమ్మ ప్రాణము విసిగినది. క్రమక్రమముగా భర్తయందు గౌరవముపోయి భయభక్తులునశించి ఎదురుమాటలాడ నేర్చి జగడమాడసాహసించి మన్ననపిలుపులు దూరమై తిట్టుటకు వెనుదీయనట్లుగా మారిపోయినది పున్నమ్మస్వభావము. పిల్లకు యెనిమిదినెలలు వచ్చుటచే అన్నప్రాశనము చేయవలెనని పున్నమ్మ యెంతయో కుతూహలపడినది. కాని బుచ్చిరాజు, భార్య బావిపద్దకు నీళ్లకువెళ్లగా జూచి పిల్లను తిన్నగా యెంగిలివిస్తరివద్దకు వదలెను. ఆపిల్ల చల్లగా ప్రాకివెళ్లి విస్తరివద్ద కూర్చుండి యెంగిలిమెతుకులు తీసి నోటబెట్టుకొనినది. ఇంతలో పున్నమ్మవచ్చి తానే యన్నప్రాశనము గావించుకొనిన పిల్లనుజూచి మగనిని నాల్గు శపించి తనదురదృష్టమునకు గొంత దుఃఖించి కన్నులు తుడుచుకొని యూరుకొనెను. అంతటితో పిల్లయన్నప్రాశనబాధ బుచ్చిరాజుకు పోయినది.

పున్నమ్మ పుట్టినింటినుండి తెచ్చుకొనిన పాత్తిగుడ్డలన్నియు చిఱిగిపోయినవి. పిల్లను వట్టినులక మంచముపై బరుండజేయుటచే పిల్ల వెన్నునను, చేతులపైనను నులకవత్తుకొని యెఱ్ఱగా నులకత్రాళ్లవలె అచ్చు లేర్పడినవి. పిల్లయొడలును జూచుటతోడనే పున్నమ్మ కనులనుండి బొటబొట నీళ్లు కారినవి. భరింపలేక నాటిరాత్రి పున్నమ్మ "పిల్లకు పక్కగుడ్డ పైగుడ్డలేదు. వట్టినులకపై పరుండబెడితే నులక ఒత్తుకుంటున్నది. ఒక్కజంపకాణా

మయినా, ఒకదుప్పటైనా తెచ్చిపెట్టుమని మగనిని యడిగెను.

బు—నావద్ద డబ్బులేదు. జంపకానాలు, శాలువలు నేను కొనలేను.

పు—పట్టెమంచముమీద పరుండబెట్టే నులక వత్తుకోదూ, రాత్రి నత్తుకున్న అగ్గలు చూడండి యెఱ్ఱగా ఎట్లాగున్నవో.

బు—నులకవత్తుకుంటే నేలమీద పరుండబెట్టు. పదినెలల పసిపిల్లకు పెద్ద జంపకానాలు కావాలె కాబోలు.

బుచ్చిరాజు పలికిన పలుకులకు పున్నమ్మ కడుపు భగ్గున మండిపోయినది. ఆకోపముతో రివ్వున బోయి, "పదినెలల పసిముండకు కాక పోతే పక్కగుడ్డలు నీవైనేనా పెద్ద వచ్చి నాళ్ళ" కెందుకని మగని శాల్వాకొనిన దుప్పటిని లాగుకొని వచ్చి పిల్లకు పక్క వేసినది. ఆవిశక్తి యను పానతారముచూచి బుచ్చిరాజు కిక్కురుమనక కుదపడకొన్నాడు. అధర్మియ గృహస్థుకు ధర్మపత్ని పనుపాలగునది యెప్పటికైన సింహాసనమేగదా.



"నవ్వు నవరత్నములు"

పూడిపెద్ది వెంకటరమణయ్య గారు

పలుకులను దేనె లొలుకంగఁ బలుకరించు
మోముతో నచ్చు మధుమాసమునకు
స్వాగతంబిడి మన్నించి స్వచ్ఛహృదయ [నలరి
మట్టి తెల్లంబుగాఁగ మోహంబు దూఁగ
కలికలలు మీఱఁ గన్నుల కఱవుదీర
మల్లికాసూనముఖమున మసలియాడు
చల్లముత్తెములను రువ్వు తేట నవ్వ
చాలుచాలును! హృదయప్రశాంతమునకు.

మోము నిర్మలరాగసుభూషితమ్ము
...రంగంబు మధురసాయనపుఁ జేటి
...వరతమందు నిందు క్షుదార్తిఁ దిరుగు
యాచకాళికి నలయు నాహారమిడుట
జీవితాశయ మట్టి సచ్ఛీలమతిని
వరలుఁ గానికా రత్నపుష్పమ్మునుండి
కెంపులను రువ్వ మది పులకించు నవ్వ
చాలుచాలును! హృదయప్రశాంతమునకు.

నలి తొలియులేని మేనిక్రొందళుకుతోడఁ
దలఁప నలపించి మించు నెత్తావితోడ
నేర్పుమైజూరు నోటితేనియలతోడ
గానమిడి సేవఁజేయు భృంగములతోడ
నిత్యకళ్యాణముగ జీవనియతిఁ గడపు
వికచపున్నాగముఖమున విందుసేయు